# కథ

# డిష్...డిష్యూం

“ఇక లాభం లేదు ఏదో ఒక నిర్ణయం తీసుకొని అడుగు ముందుకే యాలి” భారంగా నిట్టూర్చారు శ్రీవారు.

“అవును..రోజు రోజుకీ అతడి ఆగడాలు శృతిమించుతున్నాయి” వత్తాసు పలికాను.

“ముక్కుపిండి మరీ వంద రూపాయలు తీసుకుంటున్నాడు. వదిలేవి నిండా అయిదు కూడా లేవు” అన్నాడు శ్రీవారు.

“అవును. నాన్నగారూ..ఇంచక్కా సౌజన్య వాళ్లు కూడా పెట్టేసుకున్నారు. ఎన్ని వస్తున్నాయనుకున్నారూ?” పిల్లలూ మాతో శృతి కలిపారు.

ఇంతకీ మేం మాట్లాడుతున్నది దేని గురించో తెలుసా! కేబుల్ ప్రసారాల గురించి..అక్షరాలా అంతే.

మాదొక మోస్తరు పల్లెటూరు. కాలక్షేపం జరగడం కష్టం. అలాంటప్పుడు కనకరాజు అనే కుర్రాడు కేబుల్ నెట్‌వర్క్ నెలకొల్పాడు.

అతడికి ‘కేక’ అని నిక్‌నేమ్ తగిలించారు మా ఊరు కుర్రాళ్లు.

‘కేక’ అంటే ‘కేబుల్ కనకరాజు’ అని అర్థమయ్యిందనుకుంటాను.

అతడిచ్చేవి నాలుగు ఛానెళ్ళు మాత్రమే. అవీ సక్రమంగా వస్తున్నాయా అంటే అదీ లేదు. ఒకటొస్తే ఒకటిరాదు. కానీ వంద రూపాయల కోసం ప్రతి నెలా ఒకటో తారీఖు కల్లా ఠంచనుగా హాజరు వేయించుకుంటాడు.

పవర్‌కట్ పుణ్యాన ఏ ఛానలూ కంటిన్యుయస్‌గా చూసే భాగ్యం ఉండదు. కరెంట్ ఉన్నప్పుడు ‘కేక’ రిపేర్స్‌తో పుణ్యకాలం కాస్తాగడిచిపోతుంది.

ఊర్లోని కేబుల్ బాధితులందరూ ఓ సంఘంగా ఏర్పడి ‘కేక’ మీద నిరసన ప్రారంభించారు. మా వారికి అధ్యక్ష పదవి కట్టబెట్టి ముందు నిలబెట్టారు.

అందరూ కట్టగట్టుకొని ‘కేక’ మీదకి దండెత్తారో శుభదినాన.

“అదేంటి సార్! అన్నీ తెలిసి ఊకుమ్మడి యుద్ధానికొచ్చారు. ఈమధ్య అన్ని ఛానెల్స్ పే ఛానెల్స్ అయిపోతున్నాయి. వాటిని మళ్లీ తేవాలంటే మరికొంత అమౌంట్ పే చేయాలి. మీరు నెలకి నూటయాభై చొప్పున ఇస్తామంటే చెప్పండి. నేను అమౌంట్ కట్టేసి వాటిని తిరిగి రప్పిస్తాను” అన్నాడు కేక నదురు-బెదురు లేకుండా.

శ్రీవారు తనలోని నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శిస్తూ “ఇప్పుడు నీకిస్తున్న వందే ఎక్కువ..అదనంగా యాభయ్యా...ససేమిరా!” అన్నారు.

“అలా అయితే నేనిచ్చే ఛానల్స్‌తో సరిపెట్టుకోండి. చీటికీ-మాటికీ నామీద దండెత్తకండి” అన్నాడు కే.క.

తాను తప్ప ఆ ఊరికి మరొక దిక్కులేదన్న గర్వం అతడి చేత పలికిస్తోంది.

“దండెత్తకుండా ఎలాగయ్యా! నువ్వు ఇచ్చేవి నాలుగే నాలుగు ఛానళ్లు..అవి కూడా టి.వి.స్క్రీన్ మీద సగ్గుబియ్యం వడియాలు పెట్టినట్లుగా చుక్కలు..చుక్కలుగా వస్తున్నాయి” పోరాట స్ఫూర్తితో ముందుకు దూసుకుపోయారు శ్రీవారు.

ఆ ఆవేశంలో ఇందాకా తన వెనుక సైన్యంలా వచ్చిన ఊరిజనం, శతృసైన్యాన్ని చూసి భీరువుల్లా వెనుదిరిగిన సైనికుల్లా, చల్లగా జారుకోవడం గమనించలేదు.

ఇంకా..వీరావేశంలో పూనకం వచ్చినట్లుగా కేక మీద కేకలు వేయసాగారు.

“ఎందుకు సార్..అనవసరంగా ఆయాసపడతారు. మీకూడా వచ్చిన వాళ్లు ఎప్పుడో వెళ్లిపోయారు. నలుగురితో పాటు నారాయణా అనకుండా మీరొక్కరే అల్లరి చేస్తారెందుకు?” వెటకారంగా నవ్వాడు కేక.

కె.కె.భాగ్యశ్రీ

అప్పుడు స్పృహలోకొచ్చారు శ్రీవారు. ఉద్యమాన్ని మధ్యలోనే వదిలేసి పారిపోయినందుకు ఊళ్లోవాళ్ల మీద కారాలు మిరియాలు నూరారు.

ఆ క్షణాన్నే భీషణ ప్రతిజ్ఞ చేశారు..“కేబుల్ కనక రాజుకి గర్వభంగం కావించి తీరుతానని”

ప్రతినంటే పూనారు గాని దాన్ని నెరవేర్చుకొనే మార్గమేదీ తోచలేదాయనికి.

కనకరాజు మీద పంతం కొద్దీ కేబుల్ కనెక్షన్ తీయించేయాలనుకున్నారు.

కానీ డైలీ సీరియల్స్‌కి ఎడిక్ట్ అయిన మా అత్తగారు ఆ పనికి సుతరామూ అంగీకరించలేదు.

“ఈ పల్లెటూళ్లో ఆపాటి కాలక్షేపాన్ని ఇస్తున్నాడు ఆ కుర్రాడు..వాడితో కయ్యం దేనికీ” అన్నారు ఆవిడ ఇవేమీ లేని ఆనాటి రోజుల్లో ఖాళీ సమయాన్ని తానెలా గడిపేవారో విస్మరించి.

చేసేదిలేక నోరు మూసుకున్నారు శ్రీవారు.

అలాంటి సందర్భంలోనే శ్రీవారి ప్రాణమిత్రుడు పాంచజన్యం ఓ వార్తను మోసుకొచ్చాడు.

“ఇప్పుడు ‘డైరెక్ట్ టు హోమ్’ అన్న పథకం ద్వారా ఉపగ్రహం నుంచి నేరుగా మన ఇంటికే ప్రసారాలు వచ్చే వీలుందట” అంటూ.

అంతే..శ్రీవారి వదనం నూతన కాంతితో వెలిగిపోయింది.

“ఏదీ..ఏదీ..మళ్ళీ చెప్పు” ఇనుమడించిన ఉత్సాహంతో పాంచజన్యాన్ని తరచి, తరచి అడిగి అన్ని వివరాలూ తెలుసుకున్నారు.

“చిన్న సైజ్ డిష్, సెట్‌టాప్ బాక్స్, ఎల్.ఎన్.బి..ఈ మూడు పరికరాలు కావాలి దీనికి..డిష్ డిస్ట్రిబ్యూట్ చేసే డీలర్‌కి కొంత అమౌంట్ ముందుగా పే చేస్తే వీటిని తెచ్చి మన ఇంట్లో ఫిట్ చేసేసి, అన్నీ ఏర్పాటు చేసేసి వెళ్లిపోతాడు. ఆ తరువాత ఒకటి, రెండు రోజుల్లో మన సెట్‌టాప్ బాక్స్‌లో ఉన్న ‘స్మార్ట్ కార్డ్’ యాక్టివేట్ అయ్యి మనకి ప్రసారాలు రావడం మొదలెడతాయి. ‘డిజిటల్ పిక్చర్ క్వాలిటీ’తో ప్రసారాలుంటాయి. ఏడాది పాటు ఫ్రీ...ఆ తరువాత మనం తీసుకున్న ఛానెల్ ప్యాకేజీని బట్టి నెలకింతని చెల్లిస్తే సరిపోతుంది” తాను సేకరించుకొచ్చిన సమాచారాన్ని ఏకరువు పెట్టాడు పాంచ



జన్యం.

శ్రీవారు పట్టలేనంత ఆనందంతో ఊగిపోయారు.

"ఇంతకీ దీనికెంత ఖర్చవుతుందీ" అడిగాను నేను.

పాంచజన్యం చిద్విలాసం చిందిస్తూ "ఎంతా! దగ్గర దగ్గర నాలుగు వేలు అవుతుందేమో" సింపుల్‌గా చెప్పేశాడు.

"అంత డబ్బే..ఇప్పుడు నేనంత వెచ్చించే పరిస్థితిలో లేను" అనేశారు శ్రీవారు.

అంతవరకు ఆయనలో ఉరకలెత్తిన ఉత్సాహం డబ్బు ప్రస్తావన వచ్చేసరికి పాలపొంగుమీద నీళ్లు చిలకరించినట్లుగా చల్లారిపోయింది.

పాంచజన్యం మాటలు విని విని హీటెక్కిపోయిన పిల్లలు ఆయనలా వెనక్కి తగ్గడంతో డీలాపడిపోయారు.

"డాడీ...డాడీ..ప్లీజ్ కొనరూ" అని గడ్డం పట్టుకు బ్రతిమలాడాడు చిన్నవాడు.

"ఇప్పుడు కాదు నాన్న..చూద్దాంలెండి" అని ఆయన సర్ది చెప్పగానే మొహాలు వేలాడేసుకుని అవతలికి పోయారు.

ఈ విషయాన్ని వాళ్లు మరిచిపోయి హాయిగా చదువుకుంటున్న సమయంలో పాంచజన్యం డిష్ కొని ఊళ్ళో అలజడి సృష్టించాడు.

ప్రస్తుతానికి వస్తే..

"ఏంటి నాన్నగారూ..మనమూ డిష్ కొనుక్కుందామంటే మాట్లాడరు?" రెట్టించాడు చిన్నవాడు. ఘడియకి 'డాడీ' అంటాడు మరో ఘడియకి 'నాన్నగారూ' అంటాడు వాడు. వాడి మూడ్‌లో తేడా రాగానే పిలిచే పిలుపు మారుతూ ఉంటుంది.

"ఇప్పుడంత డబ్బు ఎలాగరా!" మళ్లీ పాత పాటే పాడారు శ్రీవారు.

అంతే..పొర్లిగింతలు పెడుతూ నేలంతా దొర్లి మరీ ఏడుపు లంకించుకున్నాడు చిన్నవాడు.

ఏ ఉపద్రవం సంభవించిందోనని ఇరుగు-పొరుగు వాళ్లు తొంగి చూడసాగారు.

"పోనిద్దురూ పిల్లల సరదా కాదనేదేముంది? ఆ డిష్ ఏదో కొనిపారేయండి" అన్నాను.

ఈమధ్య కేబుల్ ప్రసారాలలో కూడా నాణ్యత కొరవడడం నుంచో ఏమో పునరాలోచనలో పడ్డారు శ్రీవారు.

కాస్సేపు ఆలోచించీ, చించీ "కొనొచ్చు..కానీ డబ్బే" నసిగారు.

ఆయన మెత్తబద్దంతో ఇంటి ఖర్చులకని ఆయనిచ్చిన డబ్బులలో కొంత నొక్కేసి పోపుల డబ్బాలోనూ, చీరమడతలలోనూ దాచిన బ్లాక్‌మనీని బయటికి లాగి లెక్క పెడితే మూడు వేలు అయిదు వందలుంది.

"ఇదిగో..దీని మీద మరికొంత వేసి పిల్లల ముచ్చట తీర్చండి" దాన్ని ఆయన చేతిలో పెట్టాను.

'నాకు తెలియకుండా ఇంత డబ్బెలా కూడబెట్టావు' అన్న లుక్కొకటి పారేసి "అంతేనంటావా!" అన్నారు శ్రీవారు.

ఆయన అంగీకారం చూసి పిల్లల ముఖాలు మతాబుల్లా వెలిగిపోయాయి. ఆనందంతో గెంతసాగారు.

'కేబుల్ పీడా వదిలింది..చక్కా అరవైకి పైగా ఛానల్స్ చూడొచ్చు' మురిశాను మనసులో.

మంచిరోజు చూసి డిష్ కొని తెచ్చారు శ్రీవారు. తత్సంబంధిత మెకానిక్ వచ్చి డాబా మీద డిష్ ఫిట్ చేసేసి, అన్నీ అమర్చేశాడు.

"రిసీవర్ ఆన్ చేసి ఉంచండి. రెండు రోజుల్లో ప్రసారాలు మొదలవుతాయి" చెప్పాడు మెకానిక్.

రెండు రోజులు కాదు కదా..వారం అయినా ప్రసారాలు రాలేదు.

డీలర్‌కి ఫోన్ చేస్తే "మీ సెట్ టాప్ బాక్స్ ఓసారి తీసుకురండి..టెస్ట్ చేద్దాం" అన్నాడు.

శ్రీవారు, చిన్నవాడు కలిసి దాన్ని జాగ్రత్తగా ప్యాక్ చేసి తీసుకెళ్లారు.


"సారీ సర్..మీ స్మార్ట్ కార్డ్ యాక్టివేట్ కాలేదు. మీ నంబర్ కాకుండా ఇంకో నంబర్ యాక్టివేట్ అయినట్లుంది" అంటూ ఆ యాక్టివేట్ అయిన స్మార్ట్‌కార్డ్ వేశాడు పాతదాన్ని మార్చి.

అన్ని ఛానెళ్లు సక్రమంగా వస్తున్నాయో లేదో చెక్ చేసుకుని మరీ ఇంటికొచ్చారు.

చక్కటి పిక్చర్ క్వాలిటీతో ఎంతో క్లియర్‌గా వస్తున్న ప్రసారాలు చూసి మురిసిపోయారు పిల్లలు. 'కేక'కి ఉద్వాసన పలికి గర్వభంగం గావించినందుకు వీరుడిలా ఫీలయ్యారు శ్రీవారు.

అయితే అసలు తంటా మొదలైందిప్పుడే.

ఇదివరలో మూడో నాలుగో ఛానల్స్ మాత్రమే వచ్చేవి కాబట్టి ఏ పేచీలూ లేకుండా హాయిగా ఉండేవారు పిల్లలు.



కానీ ఇప్పుడు ఒకడు స్పోర్ట్స్ ఛానల్ అంటే..ఇంకొకడు కార్టూన్ అంటాడు. మధ్య మధ్య న్యూస్ ఛానల్ పెట్టండంటూ శ్రీవారి చిందులు, వాటి నడుమ తనకెంతో ఇష్టమైన 'గమిని' ఛానల్ అందులో రానందుకు అత్తగారి అసంతృప్తులు.

ఇల్లంతా రణరంగంలా మారింది. అయినా సరే..అనుకున్నది సాధించిన తృప్తి వాళ్లని హాయిగా ఉండనిచ్చింది.

గాలి దుమారాలవీ వచ్చినప్పుడు డిష్ కదిలిపోయి, దిశ మారకుండా ఉండేందుకు చుట్టూ చిన్న కాంక్రీట్ దిమ్మ కట్టించారు శ్రీవారు పాంచజన్యం సలహామీద.

అంతా బాగానే ఉందని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో శ్రీవారికి ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అదీ..ప్రయాణ సౌకర్యాలంతగా లేని మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి.

పిల్లలా పెద్దచదువులకి వచ్చారు. మేం వెళ్లి అక్కడ ఉండలేం. ఆయన రోజూ తిరగడం అసాధ్యం. మధ్యే మార్గంగా కాపురం టౌన్‌కి మార్చేట్లు, ఆయన వారానికోసారి వచ్చి వెళ్లేట్లు ఒప్పందం అయ్యింది.

ఇరవై రోజులపాటు చెప్పులరిగేటట్లు టౌనంతా తిరిగి గాలిస్తే ఓ చిన్న అపార్ట్‌మెంట్ అద్దెకు కుదిరింది.

సామాన్లన్నీ ప్యాక్ చేసేశాం కాని, 'డిష్' మోసుకుపోవడమే పెద్ద సమస్యగా మారింది.

"ఛ..ఇలా టౌన్‌కి షిఫ్ట్ అవుతామని తెలిస్తే ఈ లంపటం తగిలించుకోకపోదును. సిటీలో అయితే నూరో నూట యాభైయ్యో పడేస్తే బోలెడు ఛానళ్లు" అన్నారు శ్రీవారు నిరాశగా.

"ఎవరం మాత్రం అనుకున్నాం ఇలా అవుతుందని..అయినా డైరెక్ట్ ప్రసారాలనుకున్న క్వాలిటీ క్లారిటీ కేబుల్ ద్వారా ఉండదులెండి" ఓదార్చాను.

"నాన్నగారూ..డిష్‌ని సిమెంట్ దిమ్మతో సహా పెళ్లగించి పట్టుకుపోదాం...అలా అయితే డిష్ యాంగిల్ మారకుండా ఉంటుంది" సలహా ఇచ్చాడు పెద్దవాడు.

"అవునురోయ్..అంతే" ఉత్సాహంగా అరిచాడు చిన్నవాడు.

పెద్దవాడి సూచన మేరకు డిష్‌ని దిమ్మతో సహా ఎంతో జాగ్రత్తగా పెకిలించాం.

మంచిరోజు చూసి అద్దె ఇంట్లో పాలు పొంగించి కాపురం పెట్టాం.

అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఉన్న డాబా పైకి డిష్‌ను మోసుకుపోయారు కూలీలు. పాపం..బరువుతో సహా అన్ని మెట్లెక్కేసరికి చెమటలు కక్కారు వాళ్లు.

డిష్ మెకానిక్ చెప్పినట్లుగా తూర్పు ఆగ్నేయంలో డిష్ పెట్టారు.

క్రిందికి వెళ్లి అన్నీ ఫిట్ చేసి చూస్తే సిగ్నల్ స్ట్రెన్త్, క్వాలిటీ కూడా పూర్‌గా ఉన్నాయి. కాళ్లు నొప్పులు పుట్టేలా మీదికీ, క్రిందకీ తిరిగి ఎన్ని సర్దుబాట్లు చేసినా సిగ్నల్ అందలేదు.

"వెధవ తద్దినం..ఇదొక తలనొప్పైపోయింది" బుర్ర బాదుకున్నారు శ్రీవారు.

మెకానిక్ సెల్‌కి ఫోన్ చేశాం తరుణోపాయం కోసం.

"ఇప్పుడు రావడం కుదరదు సార్..సండే వస్తాను..అడ్రస్ చెప్పండి" అన్నాడతను.

అలాగేనని అడ్రస్ చెప్పారు శ్రీవారు.

అన్నట్లుగానే ఆదివారం సాయంత్రం వచ్చాడు అతను. "అదేం చిత్రమో ! అతడు చేయి వేయగానే ఠక్కున తగిలింది సిగ్నల్.

పిల్లలు ఆనందంతో ఎగిరి గంతేశారు.

"థాంక్స్ బాబూ" అన్నారు శ్రీవారు.

భావరహితంగా చూశాడతడు. ఆ చూపులో మర్మమేంటో అర్థం కాలేదప్పుడు.

సరి! మరొక నాలుగు రోజుల తరువాత వచ్చిన గాలి దుమారానికీ, డిష్ కదిలిపోయింది మళ్లీ.

డిష్ డీలర్‌కి, మెకానిక్‌కి కూడా పిల్లల చేత ఫోన్ చేయించాను.

"ఆరోజు ప్రత్యేకించి మీకోసమని వస్తే మీ నాన్నగారు కనీసం యాభై అయినా చేతిలో పెట్టలేదు. ఈసారి రావాలంటే రెండు వందలవుతుంది" అన్నా

## ఎందుకో.. ఏమిటో!!

టాలీవుడ్‌లో నటించడానికి ఎంతోమంది బాలీవుడ్ భామలు ఆసక్తి కనబరుస్తుంటే మల్లికా షెరావత్ మాత్రం 'నో' అనడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. 'దశావతారం' తమిళ చిత్రంలోనూ, ఓ కన్నడ చిత్రంలో ఐటమ్ నంబర్ చేయడానికి అంగీకరించిన మల్లిక తెలుగుకి వచ్చేసరికి మాత్రం ఎందుకో ఇష్టపడడం లేదట. ఇప్పటికే కొంతమంది ప్రముఖ తెలుగు నిర్మాతలు ఆమెని ఐటమ్ నంబర్ చేయమని అడిగినా కావలసినంత పారితోషికం ఇస్తామన్నా నో అనడానికి కారణం ఏమిటో మల్లిక చెప్పడం లేదు.